ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 26-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో అక్రమ వలసలను నియంత్రించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.
- క్వాడ్ దేశాల మధ్య సహకారాన్ని మరింతగా బలోపేతం చేస్తామని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు.
- "పీఎం వాణి" ద్వారా ప్రతి పౌరుడికి సులభమైన పబ్లిక్ వైఫైను తీసుకువస్తాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.
- ధర్మశాల స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ తొలి క్వాలిఫయర్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అక్రమ వలసలు, అసహజ జనాభా మార్పులను నియంత్రించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు ప్రకటించారు. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని, హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఈ కమిటీలో సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా కేంద్రమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న జనాభా మార్పులపై ఈ కమిటీ సమగ్రమైన అంచనా వేస్తుందని చెప్పారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని అమిత్ షా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

క్వాడ్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేస్తామని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. సెమీకండక్టర్లు, విద్యుత్ వాహనాలు, సౌర ఫలకాలు, అత్యాధునిక రక్షణ ఉత్పత్తుల తయారీలో అత్యంత కీలకమైన ఖనిజాల

విషయంలో భారత్, అమెరికా వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఢిల్లీలో ఈరోజు జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ... కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, పెట్టుబడులు వంటి అన్ని రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యంగా చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై క్వాడ్ దేశాలు దృష్టి సారించాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ... భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 4న జరిగిన క్రిటికల్ మినరల్స్ ఫోరమ్‌లోనే ఈ ఒప్పందానికి పునాది పడిందని ఆయన గుర్తు చేశారు. ఇదిలా ఉండగా క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మొటెగి తదితరులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

`పీఎం వాణి` ద్వారా ప్రతి పౌరుడికి సులభమైన పబ్లిక్ వైఫై అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. న్యూఢిల్లీలో పీఎం వాణి అమలుపై ఉన్నతాధికారులతో కేంద్ర సహాయ మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు, ప్రయాణికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులతో సహా ప్రతి ఒక్కరికీ పబ్లిక్ వైఫై కీలక ప్రజా సేవగా మారుతోందన్నారు. వినియోగదారులకు మరింత సులభతరం చేసేలా ల్యాప్ టాప్‌లు, ఇతర సెకండరీ పరికరాలకు క్యూఆర్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, మాల్స్ వంటి ప్రదేశాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత సులభతరం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో ఆవిర్భవించిన యోగా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమైన ఆమోదం పొందుతోందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... అనేక దేశాలలో దైనందిన జీవితంలో యోగా అంతర్భాగంగా మారిందని చెప్పారు. అహ్మదాబాద్‌లో జరగనున్న మొట్టమొదటి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్-2026 భారతదేశ సాంప్రదాయ ఆరోగ్య సాధనమైన యోగాను ప్రపంచ క్రీడా విభాగంగా నిలబెట్టడంలో కీలకమైన ముందడుగుగా ఆయన అభివర్ణించారు. ఈ ఛాంపియన్‌షిప్ కోసం సుమారు 75 దేశాలు నమోదు చేసుకున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా 500 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. యోగా భారతదేశ సాత్వికమైన శక్తిని ప్రతిబింబిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి యోగా ఒక కీలక మాధ్యమంగా ఆవిర్భవించిందని మన్సుఖ్ మాండవీయా వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం ఉల్లి నిల్వల కనీస హామీ సేకరణ ధరను క్వింటాల్‌కు 1,270 నుండి 1,580 రూపాయలకు సవరించింది. రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు సవరించిన ధరలు ఈరోజు నుండే అమల్లోకి వచ్చాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. వినియోగదారుల వ్యవహారాల శాఖ, నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (NAFED), నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (NCCF) అధికారులతో కేంద్రమంత్రి సమావేశం

నిర్వహించారు. నాణ్యమైన ఉల్లి నిల్వలను సమర్థవంతంగా సేకరించడానికి రైతులకు మెరుగైన ప్రతిఫలాలు లభించేలా చూడాలని ప్రహ్లాద్ జోషి అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = =

గడచిన పన్నెండేళ్ల కాలంలో దేశ వృద్ధి మరింతగా పెరిగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా పెట్టిన పోస్టులో.. దేశానికి గడచిన కాలమంతా పరివర్తన దశగా అభివర్ణించారు. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్..' అనే నినాదం ప్రతి స్థాయిలోనూ ప్రతిబింబిస్తోందని చెప్పారు. సుపరిపాలన, దేశమే ప్రథమం అనే స్ఫూర్తితో సాగిన ఎన్డీయే ప్రభుత్వ పాలన ఇప్పుడు `వికసిత్ భారత్ 2047` లక్ష్యం దిశగా పయనిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సామాజిక మధ్యమంలో  పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ పన్నెండేళ్ల కాలం సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ అభివర్ణించింది. కేంద్ర ప్రభుత్వం సాధించిన 22 ముఖ్యమైన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాల స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ తొలి క్వాలిఫయర్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన గుజరాత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టపోయి 112 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు రాష్ట్రాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మధ్య భారతం, వాయువ్య భారతంలోని అనేక ప్రాంతాల్లో వడగాలుల ప్రభావం మూడు నుండి నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. ఈరోజు ఢిల్లీలో వడగాలుల పరిస్థితులపై ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రేపు కూడా ఢిల్లీలో వడగాలుల ప్రభావం కొనసాగుతుందని ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ సుప్రీత్ కుమార్ తెలియచేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (KVIC) 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక చారిత్రక మైలురాయిని సాధించింది. ఇది ఏకంగా లక్షా 87 వేల కోట్ల రూపాయల టర్నోవర్‌ను నమోదు చేసింది. KVIC ఛైర్మన్ మనోజ్ కుమార్ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కోట్లాది మంది గ్రామీణ కళాకారుల పరిశ్రమ వల్లనే ఇది సాధ్యపడిందని తెలిపారు. ఇదిలా ఉండగా KVIC రెండు కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తోందని, వీరిలో 80 శాతం మంది మహిళలేనని ఆయన పేర్కొన్నారు. 12 ఏళ్ల క్రితం.. ఖాదీ పరిశ్రమ టర్నోవర్ కేవలం 30 వేల నుండి 32 వేల కోట్ల రూపాయల మధ్య మాత్రమే ఉండేదని మనోజ్ కుమార్ గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =